## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



నిల్వ నీరు పారబోస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

సుల్తానాబాద్: వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, కమిషనర్ వేణుమాధవ్ ప్రజలకు సూచించారు. మున్సిపల్ పరిధిలో డ్రైడే ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పలు కాలనీల్లో తిరుగుతూ ఇంట్లో ఉన్న నిల్వ నీటిని తొలగించారు. మున్సిపల్ వాహనాలకు తడి, పొడి చెత్త వేరు చేసి అందివ్వాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఎలాంటి రుగ్మతలు దరిచేరవన్నారు. వైస్‌చైర్మన్ బిరుదు సమత, స్థానిక కౌన్సిలర్లతో పాటు వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సీఏలు పాల్గొన్నారు.

### ఖిలావనపర్తిలో పోలీసుల పల్లెనిద్ర



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

ధర్మారం: గ్రామ ప్రజలతో మమేకమై సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించుకునేందుకే పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టినట్లు పెద్దపల్లి సీఐ కృష్ణ పేర్కొన్నారు. రామగుండ సీపీ ఆదేశాల మేరకు ధర్మారం మండలం ఖిలావనపర్తిలో గురువారం రాత్రి ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఎల్లవేళలా పోలీసులు అండగా ఉంటారన్నారు. శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఠాకూర్ హన్మాన్‌సింగ్, మాజీ సర్పంచు సాగంటి కొండయ్య, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు పాకాల రాజయ్య పాల్గొన్నారు.

### రేషన్ షాపు తనిఖీ

రామగిరి: మండలంలోని కల్వచర్ల రేషన్ షాపును శుక్రవారం సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సక్రమంగా చూడాలన్నారు. రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడొద్దని, రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్ కస్నూరి శ్రీనివాస్‌కు సూచించారు. దుకాణాల్లో నిర్వహించే స్టాక్ రిజిస్ట్రేషన్, స్టాక్ తెలిపే బోర్డులు, బయోమెట్రిక్ ఈ పాస్ యంత్రాలను పరిశీలించారు. డీటీ శంకర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం



విరాళం అందజేస్తున్న చంద్రయ్య

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ–2 ఓసీపీ 3లో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహించి మెడికల్ ఇన్వాడినేషన్ ద్వారా ఉద్యోగ విరమణ పొందిన చేతి చంద్రయ్య ఓసీపీ–3 అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణానికి రూ.25,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మధుసూదన్, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

### సింగిల్‌విండో పాలకవర్గానికి సన్మానం



సన్మానిస్తున్న మాజీ జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్: కోఆపరేటివ్ ఎక్సలెన్స్ మెరిట్ అవార్డు తీసుకున్న సందర్భంగా శుక్రవారం కాల్వశ్రీరాంపూర్ పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డిని, పాలకవర్గాన్ని సీఈవో కోలేటి శ్రీనివాస్‌ను మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి సన్మానించారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రైతులకు విశిష్ట సేవలందించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

**ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం**

రామగుండం: లింగాపూర్ ఆదర్శ (మోడల్) విద్యాలయంలో ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు. బైపీసీలో 17, సీఈసీలో 12 సీట్లు ఖాళీ ఉన్నాయని, విద్యార్థులు వారంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- రక్షణ చర్యలు చేపడుతున్న సుల్తానాబాద్ పోలీసులు
- రాజీవ్ రహదారిపై బారికేడ్లు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు
- దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల వరకు నియంత్రణ చర్యలు




డివైడర్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న ఎస్సై (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా సుల్తానాబాద్ పోలీసులు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. సుల్తానాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలోని దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల వరకు ఉన్న రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాద నియంత్రణ, రక్షణ చర్యలు చేపట్టడంతో పలువురు పోలీసులను అభినందిస్తున్నారు.

**బారికేడ్లు.. హెచ్చరిక బోర్డుల ఏర్పాటు**

సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల గ్రామం వరకు ఉన్న రాజీవ్ రహదారిపై ప్రమాదం జరిగే స్థలాలను గుర్తించి రోడ్డు ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇందులో దుబ్బపల్లి, గర్రెపల్లి, నర్సయ్యపల్లి, కాట్నపల్లి, శాస్త్రినగర్, కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా, పూసాల రోడ్డు, చెరువుకట్ట, సుగ్లాంపల్లి, చిన్నకల్వల వద్ద రోడ్డు డివైడర్ల వద్ద బారికేడ్లు, వేగం నియంత్రణ కోసం మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులు, బ్లింకింగ్ లైట్లతో పాటు ప్రతీ డివైడర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

**నిరంతరం పెట్రోలింగ్..**

రహదారి వెంట పెద్ద పెద్ద వాహనాలు నిలపడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో పోలీసులు నిరంతరం పోలీసు వాహనంలో, బ్లూకోల్ట్స్ టీం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా సుల్తానాబాద్ పట్టణంలో దుకాణాల ముందు ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణ యజమానులు నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీ చేపడుతున్నారు.

**వాట్సాప్ గ్రూప్ క్రియేట్..**

రోడ్డు సేఫ్టీలో భాగంగా పోలీసులు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి అందులో మండల ప్రజలను యాడ్ చేశారు. దీంతో మండలంలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగినా.. ఇతర సంఘటనలు జరిగినా వెంటనే సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**వేగం నియంత్రణకు చర్యలు**



రామగుండం సీపీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు డ్రంకెన్ డ్రైవ్, వాహనాల తనిఖీ చేపడుతున్నాం. బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు వేగ నియంత్రణ చర్యలు చేపట్టాం.

– సుబ్బారెడ్డి, సీఐ, సుల్తానాబాద్

**బారికేడ్ల ఏర్పాటు**



మండలంలోని దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల వరకు బ్లాక్‌స్పాట్‌ల వద్ద బారికేడ్లను ఇప్పటికే ఏర్పాటు చేశాం. మరికొన్ని కొత్తవి తయారు చేయిస్తున్నాం. అవసరం ఉన్నచోట వాటిని ఏర్పాటు చేస్తాం. స్వీయ నియంత్రణతోనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. అందరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి.

– శ్రావణ్‌కుమార్, ఎస్సై, సుల్తానాబాద్

# ప్రభుత్వ భూముల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల్లో గతేడాది నాటిన హరితహారం మొక్కలను తొలగించి గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారు. కాగా శుక్రవారం సాక్షి దినపత్రికలో 'యథేచ్ఛగా ప్రభుత్వ భూముల చదును' పేరుతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి అంతర్గాం తహసీల్దార్‌కు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. సదరు భూములను అంతర్గాం తహసీల్దార్ పనకంటి రామ్మోహన్‌రావు, ఆర్‌ఐ శ్రీధర్, ఎంపీడీవో ఎం.ఏ.అలీం, ఎంపీవో అబ్దుల్ వాజిద్, ఏపీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి గంగలక్ష్మి, ఈసీ అయ్యూబ్ ఖాన్, ఫీల్డ్ అసిస్టెంట్ సురేశ్ క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను తొలగించి ప్రభుత్వ భూములను చదును చేస్తున్న వారిని గుర్తించి తమకు సమాచారం అందించాలని తహసీల్దార్ క్షేత్ర సిబ్బందిని ఆదేశించారు. సదరు భూముల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించారు.



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో అలీం

# 'కమీషన్ల కక్కుర్తితోనే వంతెన కూలింది'

ముత్తారం: మండలంలోని ఓడేడ్ వంతెన నిర్మాణ దశలోనే రెండు సార్లు, గాలికి ఎనిమిది గడ్డర్లు కూలడానికి బీఆర్‌ఎస్ పాలకుల కమీషన్ల కక్కుర్తే కారణమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆరోపించారు. ముత్తారంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఆరోజు ఎమ్మెల్యేగా, నిన్నటి వరకు జెడ్పీ చైర్మన్‌గా ఉన్న పుట్ట మధూకర్ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మానేరు వంతెనను పట్టించుకుంటే ఈరోజు రూ.కోట్ల నష్టం జరిగేది కాదన్నారు. ఆయన పాలనలో నిర్మించిన వంతెన కూలితే మంత్రి శీధర్‌బాబు బాధ్యత వహించాలనడం సిగ్గుచేటన్నారు. మూడు గడ్డర్లు కూలినప్పుడే పరిశీలనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.47.7కోట్ల నుంచి రూ.63 కోట్లకు ప్రతిపాదనలు పంపారని వివరించారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మ, నాయకులు తూటి రఫీ, బోల్నేని బుచ్చాంరావు, కోల విజయ్, గాదం శ్రీను, రాపెల్లి రామన్న, చెలుకల జితేందర్, ఆనంద్, చారి సమ్మయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న సదానందం, బాలాజీ

## అడుగుకో గుంత.. రోడ్డంతా బురద



గుంతలమయంగా ఓదెల రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి,



బురదమయంగా పొత్కపల్లిలోని రోడ్డు

ఓదెల: మండలంలోని పొత్కపల్లి, ఓదెల గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారాయి. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్ లెవల్‌క్రాసింగు గేట్‌వరకు రోడ్డుపూర్తిగా గుంతలతో బురదమయంగా మారడంతో గ్రామస్తులు కనీసం కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జమ్మికుంట నుంచి వయా పొత్కపల్లి మీదుగా సుల్తానాబాద్ వరకు మీదుగా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఓదెల రైల్వేస్టేషన్ వెనుక నుంచి ఉన్న రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. రైలు ద్వారా ప్రయాణం చేసే వారు రోడ్డుపైన రావాలంటే నరకయాతన పడుతున్నారు. వెంటనే రైల్వేశాఖ పట్టించుకొని రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## బోనమెత్తిన ఎమ్మెల్యే



బోనంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో అమ్మవారి బోనాల జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ మక్కాన్‌సింగ్ దంపతులు ఊరేగింపులో పాల్గొని నెత్తిపై బోనమెత్తుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్, ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, నాయకులు నర్సింహారెడ్డి, శంకర్‌నాయక్, బొంతల రాజేశ్, ముస్తాఫా, మహంకాళిస్వామి, కొత్త సత్యనారాయణరెడ్డి, మారెల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాల్లో వన మహోత్సవం



ఓదెల: మొక్క నాటుతున్న ప్రత్యేక అధికారి

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 12 గ్రామాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, కార్యదర్శులు, వీవోఏలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓదెల: వనమహోత్సవంలో అందరూ పాల్గొనాలని మండలం స్పెషల్ అధికారి పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని కనగర్తిలో శుక్రవారం మొక్కలు నాటారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో భాస్కర్, ఏపీఎం లతామంగేశ్వరీ, టీఏ జనార్దన్, కార్యదర్శి సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటారు. మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాలలో నిర్మాణం పూర్తియన మూత్రశాలను తమకు అప్పగించలేదని ఉపాధ్యాయులు తెలపగా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానన్నారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, పీఆర్ ఏఈ వరలక్ష్మి, ఐకేపీ ఏపీఎం పద్మ, ఏపీవో దయమణి, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు తూటి రఫీ, రాపెల్లి రామన్న, గాదం శ్రీను, కోల విజయ్, బోల్నేని బుచ్చాంరావు, కేవీ చారి, అనుము సమ్మయ్య, ప్రశాంత్ ఉన్నారు.

## ఎంపీటీసీకి సన్మానం

రామగిరి: లద్నాపూర్ ఎంపీటీసీ మేడగోని ఉమ పదవీకాలం పూర్తి కాగా శుక్రవారం బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు తుమ్మల అశోక్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ దంపతులను సన్మానించారు. ఐదేళ్లలో అన్నివిధాలా సహకరించిన ప్రజలకు, నాయకులకు ఎంపీటీసీ ధన్యావాదాలు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచ్ బడికెల విజయ, సోషల్ మీడియా మండల కన్వీనర్ కుమార్, నాయకులు శ్రీనివాస్, కుమార్, బాపు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## మాజీ ఎంపీపీకి సన్మానం



బాలాజీరావును సన్మానిస్తున్న స్వశక్తి మహిళలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కొదురుపాకలో మాజీ ఎంపీపీ బాలాజీరావును శుక్రవారం సన్మానం చేశారు. కార్యదర్శి అఖిల, స్వశక్తి మహిళలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**మొక్కల పెంపకంపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి**

పెద్దపల్లిరూరల్: పట్టణంలో వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటించి వాటిని కాపాడడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మాసిబ్బంది, ఆర్పీలతో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్ ఉన్నారు.

**పెద్దాపూర్ పంచాయతీ కార్యదర్శిపై విచారణ**

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ పంచాయతీ కార్యదర్శి పున్నమయ్యపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ గ్రామపంచాయతీలో విచారణ చేపట్టారు. గ్రామంలో డొనేషన్‌తో వేసిన సెంట్రల్ లైటింగ్‌పై పంచాయతీ నిధులతో ఎంబీ చేయించాడని కలెక్టర్‌కు స్థానికుడు ఆషాడపు రవీందర్ చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి రికార్డులను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డీఎల్‌పీవో వేణుగోపాల్ తెలిపారు. విచారణలో ఎంపీవో కిరణ్, కార్యదర్శి పున్నమయ్య, ఫిర్యాదుదారుడు రవీందర్ ఉన్నారు.

**దరఖాస్తులు ఆహ్వానం**

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో గంటల ప్రాతిపదికన కాంట్రాక్టు టీచర్లుగా పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు తెలుగు బోధించేందుకు హవర్స్ కాంట్రాక్టు టీచింగ్ స్టాఫ్‌ను నియమించేందుకు డిగ్రీ అర్హతతో పాటు టీపీటీ, టెట్ ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు 11న విద్యార్హత ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

**విధులు బహిష్కరించిన న్యాయవాదులు**

గోదావరిఖనిటౌన్: మూడు నూతన చట్టాల అమలు విషయంలో గోదావరిఖని బార్ అసోసియేషన్ న్యాయవాదులు వ్యతిరేకిస్తూ శుక్రవారం విధులను బహిష్కరించారు. చట్టాలు పూర్తిగా సామాన్యుడికి వ్యతిరేకంగా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీశ్, శ్రీనివాస్, రామ్ టింకి, శ్రీనివాస్, సత్యనారాయణ, వరలక్ష్మి, మధు, చంద్రశేఖర్, చక్రపాణి, కిషన్‌రావు, శ్రీధర్, బి.శ్రీనివాస్, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**బాధ్యతలు స్వీకరణ**

ధర్మారం: మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా ప్రేమ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల అధికారిగా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ మండల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు తీసుకున్నారు.

**ఉచితంగా మధుమేహ పరీక్షలు**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పలు ప్రాంతాల్లో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించారు. జెండా చౌరస్తాలో 66మందికి పరీక్షలు చేశామన్నారు. సభ్యులు రాంకిషన్, సత్యనారాయణ, సాదుల వెంకటేశ్వర్లు, కావేటి సురేశ్, రాంరెడ్డి ఉన్నారు.

**విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ**

సుల్తానాబాద్: వాసవి క్లబ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో 120 మంది విద్యార్థులకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎల్లంకి రాజన్న, ప్రతినిధులు శుక్రవారం నోట్‌బుక్స్ అందజేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు అక్కినపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొమరవెల్లి రమేశ్, జోన్ చైర్మన్ సంపత్ కుమార్, వాసవి క్లబ్ సభ్యులు కొమురవెల్లి భాస్కర్, సురేశ్, సురేశ్, ప్రసాద్, వంశీ, శ్రీనివాస్, వినయ్‌కుమార్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

**రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి**

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం కొత్త గేటు నుంచి లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రం వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్ శుక్రవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం ఇచ్చాడు. స్పందించిన ఎమ్మెల్యే ఎన్టీపీసీ సీఎస్ఆర్ ద్వారా రోడ్డు నిర్మించాలని ఎన్టీపీసీ అధికారులను ఆదేశించారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని టౌన్–2 పరిధిలోని తెనుగువాడ, నల్లపోచమ్మవాడ, చింతలవాడ, బండారికుంట, అమర్‌నగర్, ప్రగతినగర్, మిషన్‌సూకల్ ఏరియా, క్రిస్టియన్‌కాలనీ, టీచర్స్‌కాలనీలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

**కమాన్‌పూర్ మండలంలో..**

కమాన్‌పూర్: మండలంలోని గుండారం 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనుల కారణంగా కమాన్‌పూర్ మండలంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేంద్రకుమార్ తెలిపారు.

## అమ్మపేరిట మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మపేరిట మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు అజయ్, శిరీష, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

**జూలపల్లి మండలంలో..**

జూలపల్లి: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్, నాయకులు సంతోష్‌రెడ్డి, రాజేశ్వర్, రవీందర్, సురేశ్, అజయ్, నర్సింగం పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



పెద్దపల్లిరూరల్: సూచనలు చేస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి ఆవరణతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్, తుర్కలమద్దికుంట గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్, అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఇంటి ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతపై ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

**18వ డివిజన్‌లో స్వచ్ఛ శుక్రవారం**

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ హనుమాన్‌నగర్ ఏరియాలో రామగుండం మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ సోమేశ్ సిబ్బందితో కలిసి స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆర్పీ స్వప్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎలిగేడు మండలంలో..**

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో స్వచ్ఛ శుక్రవారం నిర్వహించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల

**మండలంలో డీఎల్‌పీవో పర్యటన**

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, నాగులపల్లెలో స్వచ్ఛ ఫ్రై డేను పురస్కరించుకొని డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ గ్రామాల్లో పర్యటించారు. నాగులపల్లెలో పంచాయతీ రికార్డుల పరిశీలన, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత పరిశీలించి తగు సూచనలు చేశారు. మండల కేంద్రంలో నర్సరీ, క్రిమిటోరియం, డంపింగ్ యార్డు, తాగునీటి సరఫరా, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీవో కిరణ్, కార్యదర్శులు లచ్చయ్య, సంపత్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

## విద్యార్థి సంఘాలు, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన టీజీపీఎస్సీ ముట్టడికి మద్దతు ప్రకటించిన బీఆర్‌ఎస్ నేతలను పోలీసులు శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ కు తరలించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నాయకులు కర్రె దేవేందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టీజీపీఎస్సీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి పిలుపులో భాగంగా యైటింక్లయిన్‌కాలనీలోని పలు విద్యార్థి సంఘాల నాయకులను గోదావరిఖని టూటౌన్ పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు టీఎస్‌ఎస్‌ఎఫ్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండీ వాజిద్, బీఆర్‌ఎస్ విద్యార్థి సంఘం కాలనీ పట్టణ అధ్యక్షుడు పులి రాకేశ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ ఉన్నారు.

ధర్మారం: గ్రూప్స్ పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ధర్మారం పోలీసులు ముందస్తుగా బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను శుక్రవారం ఉదయం అరెస్టు చేసి సాయంత్రం విడుదల చేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు కొలిపాక మణికంఠ, బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు దేవి వంశీ, బండి సురేశ్‌ను అరెస్టు చేశారు.

ఓదెల: టీజీపీఎస్సీ ఇచ్చిన ముట్టడి కార్యక్రమంలో భాగంగా ముందస్తుగా బీజేవైఎం జిల్లా కార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్, హిందువాహిని మండలశాఖ అధ్యక్షుడు శాతల కుమార్‌ను పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఉదయం అరెస్టు చేశారు. ఓదెల, పొత్కపల్లి, కొలనూర్ రైల్వేస్టేషన్లనో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్ల కేటాయింపు



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగులు

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్లను శుక్రవారం కేటాయించారు. రోడ్డు విస్తరణలో భాగంగా కోల్పోనున్న క్వార్టర్లలో ఉంటున్న కార్మికులకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక శివాజీనగర్, హనుమాన్‌నగర్, గాంధీనగర్‌లో ఉన్న కార్మికులకు క్వార్టర్లు కేటాయించారు. హౌస్ అలాట్‌మెంట్ కమిటీ అధికారులు రామ్మోహన్, సీహెచ్ లక్ష్మీనారాయణ, హన్మంతరావు, మదన్ పాల్గొన్నారు.